# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 7-2-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 139 పేజీలు:6 వెల: రూ.1/-


## టీఏఎఫ్ఆర్సీ కమిటీ చైర్మన్‌గా జస్టిస్ గోపాల్‌రెడ్డి

హైదరాబాద్ : టీఏఎఫ్ఆర్సీ కమిటీ చైర్మన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌రెడ్డి నియామకమయ్యారు. ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ చైర్మన్‌తో సభ్యులను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొఫెసర్ మంజూరు హుస్సేన్ (జేఎన్‌టీయూకు మెకానికల్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అకాడమిక్ ఎక్స్‌పర్ట్), డాక్టర్ విమలా థామస్ (సిద్దిపేట మెడికల్ కాలేజీ అకాడమిక్ ఎక్స్‌పర్ట్), జీవీ లక్ష్మణ్‌రావు (చార్టర్డ్ అకౌంటెంట్-ఫైనాన్స్ ఎక్స్‌పర్ట్), పీ సుధీర్‌రెడ్డి ( న్యాయవాది-లీగల్ ఎక్స్‌పర్ట్), ఓయూ వీసీ (ఇంజినీరింగ్ కోర్స్), కాళోజీ నారాయణ హెల్త్ యూనివర్సిటీ వీసీ (మెడికల్ కోర్స్), ఎంజీ యూనివర్సిటీ వీసీ (బీఈడీ-ఇతర కోర్సులు), ప్రభుత్వం తరఫున ఆర్థికశాఖ నుంచి, ఉన్నత విద్యామండలి చైర్మన్, ఆల్ ఇండియా కౌన్సెల్ ఆఫ్ టెక్నికల్ నుంచి ఒకరు, ఎడ్యుకేషన్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీని సభ్యుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## టర్కీలో మరోసారి పెను భూకంపం.. 7.6 తీవ్రతతో ప్రకంపనలు..

ఇస్తాంబుల్ ఫిబ్రవరి 6: టర్కీని వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. సోమవారం తెల్లవారు జామున రిక్టర్ స్కేల్‌పై 7.8 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయని యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. పెను ప్రకంపనలు సిరియా సైతం తాకాయి. శతాబ్దంలో వచ్చిన అత్యంత శక్తివంతమైన భూకంపం ధాటికి భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. ఇప్పటి వరకు దాదాపు 1612మంది వరకు మృత్యువాతపడగా.. మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలున్నాయి.

ఓ వైపు సహాయక చర్యలు చేపడుతున్న నేపథ్యంలోనే మధ్యాహ్నం ఆగ్నేయ టర్కీలో రిక్టర్ స్కేల్‌పై 7.6 తీవ్రతతో రెండోసారి భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం.. మధ్యాహ్నం 1.24 గంటలకు ఎకినోజు పట్టణానికి దక్షిణ ఆగ్నేయంగా నాలుగు కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

సిరియా జాతీయ భూకంపం కేంద్ర అధిపతి రేద్ అహ్మద్ ప్రభుత్వ అనుకూల రేడియోతో మాట్లాడుతూ చరిత్రలో నమోదైన అతిపెద్ద భూకంపమన్నారు.

తాజా లెక్కల ప్రకారం సిరియా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ప్రాంతాల్లో కనీసం 700 మంది మరణించారని తెలిపారు. టర్కీలో కనీసం 912 మంది మరణించారని టర్కీ అధ్యక్షుడు ఎర్దగోన్ పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. భూకంపం కారణంగా ఇప్పటికే వేలాది మంది గాయాలపాలవగా.. మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నది. దాదాపు మూడుకోట్ల మందికిపైగా నిరాశ్రయులయ్యారు.

వరుసగా రెండు భూకంపాలు సంభవించడంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా.. తుర్కియే, సిరియాలో భూకంపంపై ప్రధాని మోదీగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. గాయపడ్డ వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భారత్ తుర్కియేకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను పంపింది. తుర్కియేకు వైద్య బృందాలు, మందులను పంపింది.

## ఏప్రిల్ నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ : మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 6:రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆర్థిక మంత్రి హరీశ్‌రావు శుభవార్త వినిపించారు. ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నెల నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు ప్రకటించారు. సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ సవరణ చేయబోతున్నామని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం నిధులలో కోతలు పెడుతూ, అనేక ఆర్థిక ఆంక్షలు పెడుతున్నప్పటికీ, రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కోసం పెద్ద ఎత్తున ఆర్థిక అవసరాలు ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాల విషయంలో ఏనాడు తక్కువ చేయలేదన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తుల మేరకు కొత్త ఈహెచ్ఎస్ విధానాన్ని తీసుకురాబోతున్నామని హరీశ్‌రావు ప్రకటించారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఇందులో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధులను భాగస్వాములుగా చేస్తామన్నారు. దీనికి సంబంధించిన విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని హరీశ్ రావు ప్రకటించారు.

స్వర్ణయుగాన్ని తలపిస్తున్న తెలంగాణ సాగునీటి రంగం

సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు సాగునీటి రంగంలో తీరని అన్యాయం జరిగింది అని మంత్రి హరీశ్‌రావు తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. బావులు, బోర్లే దిక్కయిపోయిన రైతాంగం అప్పుల బాధలతో ఆత్మహత్యల పాలయింది. పాడుబడిన ఇండ్లు, బీడువడిన పొలాలతో తెలంగాణ బిక్కచచ్చిపోయింది. నేడు స్వరాష్ట్రంలో తెలంగాణ సాగునీటి రంగంలో స్వర్ణయుగాన్ని తలపిస్తున్నది అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణ సస్యశ్యామల మాగాణంగా సాక్షాత్కరిస్తున్నది. అన్నపూర్ణగా అవతరించి, దేశానికే అన్నం పెడుతున్నది అని తెలిపారు.

వేసవిలో సైతం మత్తడి దుంకుతూ అలుగెల్లుతున్న చెరువులూ, ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా రిజర్వాయర్లకు చేరుతున్న నదీజలాలూ సాగునీటి రంగంలో తెలంగాణ సాధించిన అద్భుతాలను ఆవిష్కరిస్తున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మిషన్ కాకతీయ పథకంతో చెరువులు బాగు పడటంతో నీటి నిల్వ సామర్థ్యం బాగా పెరిగింది. ప్రాజెక్టులతో అనుసంధానం చేయడంతో వేసవిలో సైతం చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. భూగర్భ జల మట్టం పెరిగింది. 15 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ పొందింది అని పేర్కొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేశాం..

కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఎల్లంపల్లి, మిడ్ మానేరు, దేవాదుల తదితర పెండింగ్ ప్రాజెక్టులను తెలంగాణ ప్రభుత్వం శరవేగంగా పూర్తిచేసింది. దీంతో 20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అభివృద్ధి అయింది. కరవు పీడిత ప్రాంతంగా, వలసల జిల్లాగా పేరుపడ్డ ఉమ్మడి పాలమూరు జిల్లా నేడు పచ్చని పంటలకు నెలవయింది. పాలమూరులో దొరికే వ్యవసాయ పనులకోసం ఇతర రాష్ట్రాల రైతుకూలీలు వలసలు వస్తున్నారంటే పరిస్థితిలో వచ్చిన మార్పును అర్థం చేసుకోవచ్చు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

1200 చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్నాం..

రాష్ట్ర ప్రభుత్వం రూ. 3,825 కోట్లతో 1200 చెక్ డ్యామ్ ల నిర్మాణం చేపట్టింది. వీటిలో మొదటి దశ 650 చెక్ డ్యాంల నిర్మాణం పూర్తయింది. మిగతా చెక్ డ్యాముల పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.

పాలమూరు ? రంగారెడ్డి 60 శాతం పూర్తి

ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలను సంపూర్ణంగా సస్యశ్యామలం చేసేవిధంగా తెలంగాణ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మిస్తున్నది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం దాదావు 60 శాతం పూర్తయింది. ఈ దశలో కొన్ని ప్రతిపక్షాలు కుట్రపూరితంగా కేసులు వేస్తూ అడ్డుకొంటున్నాయి. త్వరలోనే పర్యావరణ అనుమతులను సాధించి శరవేగంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం కంకణబద్ధమై ఉన్నది అని మంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి అని పేర్కొన్నారు.

73 లక్షల 33 వేల ఎకరాలకు సాగునీటి వసతి..

నేడు రాష్ట్రంలో మొత్తంగా 73 లక్షల 33 వేల ఎకరాలకు సాగునీటి వసతి ఏర్పడింది. రానున్న రెండు మూడేళ్లలో మరో 50 లక్షల 24 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. కోటికి పైగా ఎకరాల ఆయకట్టును సృష్టించాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం సంపూర్ణంగా సాకారం అవుతుందన్నారు హరీశ్‌రావు. నీటిపారుదల రంగానికి బడ్జెట్‌లో రూ. 26,885 కోట్లు ప్రతిపాదించడమైనదని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## రూ.2,90,396 కోట్లతో రాష్ట్ర బడ్జెట్..

హైదరాబాద్ ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్); అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైనాయి. తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని తన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి నేడు ప్రవేశపెట్టినున్న బడ్జెట్ ప్రతులను హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు.తెలంగాణ శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని తన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి నేడు ప్రవేశపెట్టినున్న బడ్జెట్ ప్రతులను ఆర్థికశాఖ మంత్రి హరీష్ రావు అందజేశారు. వేముల ప్రశాంత్ రెడ్డి, స్పెషల్ సీఎస్ రామకృష్ణ రావు తదితరులు పోచారంను కలిసిన వారిలో ఉన్నారు.బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని.. బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఉంటుందని హరీష్ రావు తెలిపారు. కేంద్రం సహకరించక పోయినా.. ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా బడ్జెట్‌ను రూపొందించామన్నారు. తెలంగాణ బడ్జెట్ దేశానికి మోడల్‌గా నిలుస్తుందని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. అనంతరం

అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి హరీష్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను మంత్రి హరీశ్ రావు శాసనసభలో ప్రవేశపెట్టారు. రూ. 2,90,396 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ. 2,11,685 కోట్లు. పెట్టుబడి వ్యయం రూ. 37,525 కోట్లుగా పేర్కొన్నారు.

-ప్రతి నియోజకవర్గంలో 1,100 మందికి దళితబంధు
-కొత్తగా మరో 100 బస్తీ దవాఖానాలు ఏర్పాటు
-ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా నర్సింగ్ కాలేజీలు
- బడ్జెట్‌లో ఊసేలేని నిరుద్యోగుల భృతి హామీ
-ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త ఈహెచ్ఎస్ విధానం
-ప్రతి నియోజకవర్గంలో 1,100 మందికి దళితబంధు
-ఈ ఏడాది 60 జూనియర్, సీనియర్, జిల్లా జడ్జిల కోర్టులు ఏర్పాటు
-ఏప్రిల్ నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- ఏప్రిల్ నుంచి సెర్ప్ ఉద్యోగులకు పే స్కేలు సవరణ
- మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం రూ.3వేలకు పెంపు

నీటి పారుదల రంగం రూ. 26,885 కోట్లు
వ్యవసాయ రంగానికి రూ. 26,831 కోట్లు
విద్యుత్ రంగానికి రూ. 12,727 కోట్లు
హోంశాఖకు రూ. 9,599 కోట్లు
ఆర్థిక శాఖకు రూ. 49,749 కోట్లు
విద్యాశాఖకు రూ. 19,093 కోట్లు
వైద్య రంగానికి రూ. 12,161 కోట్లు
ఆరోగ్య శ్రీ పథకానికి రూ. 1463 కోట్లు..
పరిశ్రమల శాఖకు రూ. 4,037 కోట్లు
రోడ్లు భవనాల శాఖకు రూ. 2,500 కోట్లు
పంచాయతీరాజ్ శాఖకు రూ. 31,426 కోట్లు
పురపాలక శాఖకు రూ. 11,327 కోట్లు
ప్రజా పంపిణీ వ్యవస్థకు రూ. 3,117 కోట్లు
ప్రణాళిక విభాగానికి రూ. 11,495 కోట్లు
ఐటీ, కమ్యూనికేషన్ల శాఖకు రూ. 366 కోట్లు
రుణమాఫీ పథకానికి రూ. 6,385 కోట్లు..
రైతుబంధు పథకానికి రూ. 15,075 కోట్లు
రైతుబీమా పథకానికి రూ. 1589 కోట్లు
కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకానికి రూ. 200 కోట్లు
ఆసరా పెన్షన్ల కోసం రూ. 12 వేల కోట్లు
కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కోసం రూ. 3,210 కోట్లు
దళితబంధు కోసం రూ. 17,700 కోట్లు
బీసీ సంక్షేమం కోసం రూ. 6,229 కోట్లు
మహిళా, శిశు సంక్షేమం కోసం రూ. 2,131 కోట్లు.
ఎస్సీ ప్రత్యేక నిధి కోసం రూ. 36,750 కోట్లు
మైనార్టీ సంక్షేమం కోసం రూ. 2,200 కోట్లు
గిరిజన సంక్షేమం, ప్రత్యేక ప్రగతి నిధికి రూ. 15,223 కోట్లు
మైనార్టీ సంక్షేమం కోసం రూ. 2,200 కోట్లు
ఆయిల్ ఫామ్‌కు రూ. 1000 కోట్లు
అటవీ శాఖ కోసం రూ. 1,471 కోట్లు
హరితహారం పథకానికి రూ. 1471 కోట్లు
పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమానికి రూ. 4,834 కోట్లు
డబుల్ బెడ్రూం ఇండ్ల పథకానికి రూ. 12,000 కోట్లు

## ఆయిల్ పామ్ మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌లను ప్రారంభించిన మంత్రి నిరంజన్ రెడ్డి..




హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): తెలంగాణ ఆయిల్ పామ్ మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి తోకలసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. బిఆర్ కెఆర్ భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణా రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యానవన శాఖ కమీషనర్ హనుమంతరావు లు పాల్గొన్నారు. ఈ సందర్బంగా వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగు పథకం అమలులో సౌలభ్యం, పారదర్శకత కొరకై ఈ మొబైల్ యాప్, వెబ్ పోర్టల్ లను ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ పథకం అమలు లో భాగస్వామ్యులైన రైతులు, రాష్ట్ర, జిల్లా స్థాయి ఉద్యానవన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీలు, నర్సరీ ఇంచార్జీలు ఈ మొబైల్ యాప్ లో ఉంటారని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టదలచిన భూమి విస్తీర్ణం, వంపిణి చేసిన మొక్కలు,అంతర పంటలు, పంటల కొరకై అందించిన రాయితీ తదితర వివరాలు ఈ మొబైల్ యాప్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయడం జరుగుతున్నదని మంత్రి వివరించారు.

రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పామ్ ఆయిల్ సాగు చేపట్టేందుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఈ పథకం అమలుకై ప్రభుత్వం మొదటి విడతగా రూ. 107 .43 కోట్లు విడుదల చేయగా, దీనిలో రూ. 82 కోట్లను రైతులు, కంపెనీలకు రాయితీగా అందించడం జరిగిందని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయిల్ పామ్ మొక్కల పెంపకంలో యాజమాన్య పద్ధతులు, అంతర పంటల సాగు, సూక్ష్మ సేద్యం కొరకై ఎకరానికి రూ. 50,918 లను రాయితీగా అందిస్తున్నామని అన్నారు. ప్రస్తుత 2022-23 సంవత్సరంలో 15710 మంది రైతులు 61277 ఎకరాలలో చేపట్టారని తెలిపారు. 2023-24 సంవత్సరంలో రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు లక్ష్యంగా నిర్ణయించామని వెల్లడించారు. దేశంలో 100 లక్షల మెట్రిక్ టన్ను లకు పైగా పామ్ ఆయిల్ డిమాండ్ ఉండగా ప్రస్తుతం 2.90 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి మాత్రమే ఉందని వివరించారు. దేశంలో పామ్ ఆయిల్ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలంటే అదనంగా 70 లక్షల ఎకరాల విస్తీర్ణం అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 3.66 లక్షల టన్నుల పామ్ ఆయిల్ అవసరం కాగా ప్రస్తుతం 52 ,666 టన్నుల ఉత్పత్తి మాత్రమే జరుగుతుందని తెలిపారు.

నూనె గింజల వంటల్లో పామాయిల్ ఎక్కువ దిగుబడినిస్తుందని, దాదాపు 30 సంవత్సరాలవరకు ఎకరానికి లక్షన్నర వరకు ఆదాయం పొందవచ్చని వెల్లడించారు. రాష్ట్రంలో పామ్ ఆయిల్ మొక్కలు పెంచడం కోసం ఇప్పటి వరకు 38 కంపెనీలు నర్సరీలు ఏర్పాటు చేశాయని తెలియచేశారు.

## ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలి

మెదక్, ఫిబ్రవరి 6: (నేటినిజం ప్రతినిధి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి ప్రజావాణి పోర్టల్ లో అప్ డేట్ చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదిదారుల నుండి అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్ లతో కలిసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణయాధికారాలు తీసుకునే జిల్లా అధికారులే తప్పనిసరిగా ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని, అత్యవసరమైతే ముందస్తుగా అనుమతి పొంది తరువాత స్థాయి (నెక్స్ట్ లెవెల్ ) అధికారిని పంపాలని సూచించారు. ఇప్పటి వరకు వివిధ శాఖలలో పెండింగులో ఉన్న 359 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిపెట్టి వచ్చే ప్రజావాణి కార్యక్రమం నాటికి పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదిదారులతో క్రిక్కిరిసిన ప్రజావాణిలో కలెక్టర్ నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ ఫిర్యాదీదారుల సమస్యలు సావధానంగా ఆలకించి, ఆప్యాయంగా పలుకరిస్తూ తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ధీమా కల్పించారు. ప్రతి ఫిర్యాదీదారుడు ముందుగా కంప్యూటర్ లో నెంబర్ జెనరేట్ చేసుకున్న తరువాతే ఫిర్యాదులు పరిశీలించారు. 60 దరఖాస్తులు రాగా అందులో ప్రధానంగా భూ సమస్యలు, ధరణి, రెండు పడకల ఇళ్ళు , ఆసరా పింఛన్లు, ఆర్థిక సహాయం, మూడు చక్రాల సైకిళ్ళు, తదితర వాటికి సంబంధినవి ఉన్నాయి. అలాగే అర్హులైన మైనారిటీలకు ఋణం మంజూరు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, దేవాలయానికి ఇచ్చిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని విజ్ఞప్తులు వచ్చాయి.. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదీదారుల సమస్యలను పరిశీలించి పరిష్కారమయ్యే వాటిని వెంటనే పరిష్కరించాలని, తిరస్కరించే వాటికి కారణాలు తెలపాలని, పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సదరం క్యాంపులో 40 శాతం పైగా వికలాంగత్వం ఉన్నట్లు ధ్రువపత్రం ఇస్తేనే వికలాంగుల పింఛనుకు అర్హులని, తిరస్కరణకు గురైన పింఛను మంజూరు

దరఖాస్తును తిరిగి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొనుటకు పాత ఐ.డి. ని రద్దు చేస్తూ కొత్త ఐ.డి. కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించవలసినదిగా డిఆర్ డిఓ కు సూచించారు. రేపటి నుండి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దరఖాస్తులు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయవలసినదిగా ఏ.ఓ.యూనుస్ కు సూచించారు. ఆస్తి తగాదాలకు సంబంధించి భూ సమస్యల పరిష్కారానికి కోర్టును ఆశ్రయించవలసినదిగా ఫిర్యాదీదారులకు సూచించారు. తమ సమస్యలతో పాటు నలుగురికి ఉపయోగపడే సామాజిక సమస్యలు ప్రజావాణి దృష్టికి తేవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు శైలేష్, జయరాజ్, కమలాకర్, శ్రీనివాస్ రావు, శ్రీనివాస్, కేశూరం, ఆశా కుమారి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారం చేసిన సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తులు




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తులుగా కొలీజియం సిఫారసు చేసిన ఐదుగురి జడ్జిలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. మణిపూర్ హైకోర్టు చీఫ్ జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పంకజ్ మిత్తల్, పాట్నా హైకోర్టు సీజే జస్టిస్ సంజయ్ కరోల్, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎహసానుద్దీన్ అమానుల్లా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ మిశ్రాకు సుప్రీం జడ్జీలుగా పదోన్నతి లభించిన విషయం తెలిసిందే.ఈ ఐదుగురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం గత ఏడాది డిసెంబర్ 13న సిఫారసు చేయగా.. కేంద్రం దాదాపు రెండు నెలలకు ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో తాజాగా వీరు ఐదుగురు సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తులుగా ప్రమాణం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కొత్త జడ్జిలతో ప్రమాణం చేయించారు. దీంతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 32కి చేరింది.

### కొత్త న్యాయమూర్తులు వీరే..

#### జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్

1963, ఆగస్టు 14న జన్మించారు. తల్లిదండ్రులు పద్మావతమ్మ, రామచంద్రారెడ్డి. వీరిది కడప జిల్లా, అయితే సంజయ్‌కుమార్ పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. నిజాం కాలేజీలో కామర్స్‌లో గ్రాడ్యుయేషన్ చేశారు. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి 1988లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. పి రామచంద్రారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అడ్వకేట్ జనరల్‌గా 1969-82 మధ్య పనిచేశారు. సంజయ్‌కుమార్ 1988లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొన్నారు. 2000-03 మధ్య ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2008 ఆగస్టులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అదనపు జడ్జిగా పదోన్నతి పొందిన ఆయన.. 2010, జనవరి 20న శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2019లో పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయిన జస్టిస్ సంజయ్‌కుమార్, 2021, ఫిబ్రవరిలో మణిపూర్ హైకోర్టు సీజే అయ్యారు.

#### జస్టిస్ పంకజ్ మిత్తల్

1982లో అలహాబాద్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పొందిన జస్టిస్ పంకజ్ మిత్తల్.. మీరట్‌లో ఎల్ఎల్‌బీ చేశారు. 1985 నుంచి అలహాబాద్ హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2021, జనవరిలో జమ్ముకశ్మీర్ సీజేగా పదోన్నతి పొందారు.

#### జస్టిస్ సంజయ్ కరోల్

పాట్నా హైకోర్టు సీజేగా 2019, నవంబర్‌లో నియమితులయ్యారు. అంతకుముందు త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. త్రిపుర స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ పాట్రాన్-ఇన్-చీఫ్‌గా, త్రిపుర జ్యుడీషియల్ అకాడమీ చైర్మన్‌గా విధులు నిర్వర్తించారు.

#### జస్టిస్ ఎహసానుద్దీన్ అమానుల్లా

పాట్నా హైకోర్టు న్యాయమూర్తిగా 2011లో నియామకం పొందారు. ఆ తర్వాత 2021లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు.. మళ్లీ 2022, జూన్‌లో పాట్నా హైకోర్టు బదిలీ అయ్యారు. 1963, మే 11న జన్మించిన జస్టిస్ అమనుల్లా.. 1991లో బీహార్ స్టేట్ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొన్నారు.

#### జస్టిస్ మనోజ్ మిశ్రా

అలహాబాద్ యూనివర్సిటీ నుంచి లా పట్టా పొందారు. 2011లో అలహాబాద్ హైకోర్టు అదనపు జడ్జీగా పదోన్నతి పొందారు. 2013లో శాశ్వత న్యాయమూర్తి అయ్యారు.

## ఎగిసిపడుతున్న అలలు : భూప్రకంపనలకు తోడు వణికిస్తున్న సునామీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:టర్కీ, సిరియాలను వణికించిన భారీ భూకంపం వందల మందిని బలిగొంటే తీర ప్రాంత నగరాలు, పట్టణాలను సునామీ వణికిస్తోంది. సునామీ తీవ్రతకు తీర ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. సముద్ర అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. డచ్ జర్నలిస్ట్ బ్రెంద స్టోటర్ బస్కలో తీర ప్రాంతంలో సునామీ తీవ్రతను వెల్లడించే వీడియోలను ట్వీట్ చేశారు. ఇక దక్షిణ టర్కీ కేంద్రంగా సోమవారం తెల్లవారుజామున భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 7.8గా నమోదైంది. భూకంపం ధాటికి రెండు దేశాల్లో కలిపి మొత్తం 1700 బిల్డింగ్‌లకు పైగా ధ్వంసం అయినట్లు టర్కీ ఉపాధ్యక్షుడు తెలిపారు.

కాగా, భూకంపం సమయంలో ఇళ్లు, బిల్డింగ్‌లు కూలిపోతున్న భయానక దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. భూ ప్రకంపనల ధాటికి ఎత్తైన భవంతులు, ఇళ్లు క్షణాల్లో నేలమట్టమయ్యాయి.రీ భూకంపం తర్వాత కూడా బలమైన భూ ప్రకంపనలు నమోదు అయినట్లు అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే పేర్కొంది. కనీసం 18 సార్లు భూమి రిక్టరు స్కేలుపై 4 కంటే ఎక్కువ తీవ్రతతో కంపించినట్లు తెలిపింది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 640 మందికి పైగా మృత్యువాత పడగా.. వేలల్లో ప్రజలు గాయపడ్డారు. ఈ భూకంపం వల్ల మరణాల సంఖ్య దాదాపు పది వేలకు చేరే అవకాశం ఉన్నట్లు అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే అంచనా వేసింది.

టర్కీ, సిరియాల్లో సోమవారం ఉదయం తలెత్తిన పెను ప్రకంపనలను మూడు రోజుల ముందుగానే ఓ వ్యక్తి ఊహించారని సోషల్ మీడియాలో వెల్లడైంది. భూప్రకంపనలను అధ్యయనం చేసే సోలార్ సిస్టమ్ జియోమెట్రీ సర్వే (ఎస్ఎస్‌జీఈఓఎస్)కు చెందిన పరిశోధకులు ఫ్రాంక్ హూగర్బీట్స్ ఈ భూకంపాన్ని మూడు రోజుల ముందే అంచనా వేశారు. దక్షిణ మధ్య టర్కీ, జోర్డాన్, సిరియా, లెబనాన్ ప్రాంతంలో త్వరలో లేదా మున్ముందు రిక్టరు స్కేలుపై 7.5 తీవ్రతతో భూకంపం సంభవిస్తుందని ఫ్రాంక్ హూగర్బీట్స్ ట్వీట్ చేశారు. అయితే ఆయన సూడో సైంటిస్ట్ అని, గతంలో ఆయన అంచనాలను ప్రశ్నిస్తూ పలువురు ట్విట్టర్ వేదికగా ఫ్రాంక్ అంచనాను ప్రశ్నించారు.



## విభజన చట్టంలో గిరిజన వర్సిటీల ఏర్పాటు ప్రతిపాదన ఉంది: కేంద్రం

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ లో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై కేంద్రం ప్రకటన చేసింది. దేశంలో 2020-21 నాటికి 24.10 లక్షల మంది గిరిజన విద్యార్థులున్నారని కేంద్రం పేర్కొంది. ఇప్పటివరకు ఏపీ, మధ్యప్రదేశ్‌తో కలిపి 2 గిరిజన వర్సిటీలు ఉన్నాయని లోక్ సభలో కేంద్రం వెల్లడించింది. ఈ 2 వర్సిటీల్లో 523 మంది విద్యార్థులే ఉన్నారని కేంద్ర విద్యాశాఖ పేర్కొంది. విభజన చట్టంలో గిరిజన వర్సిటీల ఏర్పాటు ప్రతిపాదన ఉందని కేంద్రం తెలిపింది. కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటు నిరంతరం కొనసాగే ప్రక్రియ అని తెలిపింది. గిరిజన వర్సిటీలు అవసరాన్ని బట్టి ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. వీటికి నిర్ణీత ప్రమాణాలంటూ ఏమీ లేవని కేంద్ర విద్యాశాఖ స్పష్టం చేసింది. లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ సహా సభ్యుల ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

### చరిత్రలో నేటినిజం





( ఫిబ్రవరి 7 బినోద్ బిహారీ ముఖోపద్యాయ జయంతి..)



-రాధశ్రీ
సెల్:9494481210


నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

# పాటకు శాస్త్రీయ రాగాలద్దిన వాణి

## (ప్రముఖ బహుభాషా నేపథ్య గాయని వాణి జయరాం అమరత్వానికి అక్షర నివాళి)

'ఆనతినీయరా హరా' అంటూ ఆర్ద్రతతో ఆలపించినా, 'దొరుకునా ఇటువంటి సేవ' అంటూ సమర్పణ భావనలు ఒలికించినా, 'పూజలు చేయ పూలు తెచ్చాను' అంటూ భగవంతుడిని నిద్ర లేపినా, 'మానస సంచరరే బ్రహ్మణి మానస సంచరరే' అంటూ శాస్త్రీయ సంగీత రాగాలను జాలువారించినా అది ఆమె సుస్వరాల గొంతు మహిమే. భారత దేశ 19 భాషల్లో అనేక సినీ గీతాలు, భక్తిగీతాలు, ప్రైవేట్ ఆల్బమ్‌ల ద్వారా శాస్త్రీయ రాగాలద్ది కోట్లాది ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిన వాణి జయరాం ఇక లేరు అనే వార్త శ్రోతలను, సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచింది. 78 ఏళ్ళ వాణి జయరాం 4 ఫిబ్రవరి 2023న చెన్నైలోని తన నివాసంలో తలకు గాయాలతో అనుమానాస్పద స్థితిలో తుది శ్వాస విడిచారు.

### వ్యక్తిగత వివరాలు:

30 నవంబర్ 1945న దొరైస్వామి అయ్యర్ పద్మావతి దంపతులకు వెల్లూరు, తమిళనాడులో జన్మించిన ప్రముఖ దక్షిణ భారత నేపథ్యగాయని వాణి జయరాం గత ఐదు దశాబ్దాలుగా దాదాపు 20,000 పాటలు, అనేక భక్తి గీతాలు, ప్రైవేట్ ఆల్బమ్స్‌లో గాత్రదానం చేసి శ్రోతలను సంగీత సాగరంలో ఓలలాడించారు. చిరు ప్రాయంలోనే బాల మేధావిగా 8వ ఏటనే 'ఆల్ ఇండియా రేడియో', మద్రాస్ కార్యక్రమంలో తొలిసారి తన సుమధుర గొంతును వినిపించారు. కర్నాటక సంగీతాన్ని శ్రీనివాస్ అయ్యర్, బాలసుబ్రహ్మణ్యం, ఆరెస్ మణిల వద్ద నేర్చుకొని హిందూస్తానీ సంగీతాన్ని ఉస్తాద్ రహ్మాన్ ఖాన్ వద్ద ఆలకింపు చేసుకున్నారు. చెన్నైలోని 'లేడీ శివసామి హైస్కూల్'లో పాఠశాల విద్య, 'క్వీన్ మేరీస్ కాలేజీ'లో డిగ్రీ పూర్తి చేసిన తరువాత 'యస్‌బిఐ బ్యాంకు' మద్రాస్, హైదరాబాదు శాఖల్లో పని చేసి జయరాంతో వివాహం జరిగిన తరువాత 1969లో బదిలీపై ముంబయికి మకాం మార్చారు. భర్త జయరాం ప్రోత్సాహంతో సంగీత సాధన చేసి తన ప్రతిభకు పదును పెట్టుకున్నారు

### బహుభాషా గాయని:

టాలీవుడ్‌లో అనేక సినీ గీతాలు ఆలపించి న వాణి జయరాం స్వాతికిరణం, శృతిలయలు, స్వర్ణకమలం, పెళ్ళి పుస్తకం, సీతాకోకచిలుక, శంకరాభరణం, మరో చరిత్ర, గుప్పెడా మనసు, ఇది కథ కాదు లాంటి పలు తెలుగు చిత్రాల్లో తన గొంతు విప్పి రాగాల పంట పండించారు. తెలుగు, కన్నడ, తమిళ్, మళయాలం, మరాఠీ, ఒడిసీ, గుజరాతీ, హర్యాన్వీ, అస్సామీ, తులు, బెంగాలీ లాంటి 19 భారతీయ భాషల్లో అనర్గళంగా తన గొంతును వినిపించిన వాణి జయరాం ప్రముఖ జాతీయ స్థాయి గాయనిగా సుస్థిర స్థానం దక్కించుకున్నారు. వివాహానంతరం ముంబాయిలో స్థిరపడిన వాణి జయరాం ప్రముఖ హిందీ చలన చిత్రం 'గుడ్డి'లో 'బోలే రే పపీ హరా' అనే పాట ద్వారా 1971లో సినీ నేపథ్య గాయనిగా తెరగేట్రం చేసి సుస్థిర స్థానం దక్కించుకున్నారు. 1973లో తొలి తమిళ, తెలుగు, మళయాలం, కన్నడ భాషల్లో పాటలను పాడారు వాణి జయరాం. కోదండ పాణి సంగీత దర్శకత్వంలో 'అభిమానవంతులు' సినిమా ద్వారా తెలుగు నేపథ్య గాయనిగా అవతారమెత్తారు. 1979లో విడుదలైన 'శంకరాభరణం' సినిమాలో పాడిన పాటలు ఆమెను ప్రతి తెలుగింటి అభిమాన గాయనిగా మారారు.

### వరించిన పురస్కారాలు:

2023లో వాణి జయరాం కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వ 'పద్మభూషన్' అవార్డును ప్రకటించిన కొద్ది రోజుల్లోనే ఆ పురస్కారం తీసుకోక ముందే కన్ను మూయడం బాధాకరం. 1975, 1980, 1991ల్లో ఉత్తమ జాతీయ మహిళ నేపథ్య గాయనిగా మూడు 'జాతీయ ఫిలిం అవార్డు'లు పొందారు. 1980, 2014, 2015ల్లో 'ఫిలింఫేర్ అవార్డు'లు, 1972లో గుజరాత్, 1979లో తమిళనాడు, 1979లో ఆంధ్రప్రదేశ్, 1982లో ఒడిసా రాష్ట్రాల అవార్డులు పొందారు. వీటితో పాటు 'మియాన్ తాన్‌సేన్ అవార్డు'(1972), 'ఫిలిం వరల్డ్'(1979), 'సినీ హెరాల్డ్'(1979), 'కలైమణి అవార్డు'(1991), 'సంగీత పీఠ్ సమ్మాన్'(1992), 'తమిళ జీవన సాఫల్య పురస్కారం'(2004), 'కమకుర అవార్డు'(2005), 'ముద్రా అవార్డు'(2006), 'సుబ్రహ్మణ్య భారతి అవార్డు'(2012), 'రేడియో మిర్చి జీవనసాఫల్య పురస్కారం'(2014), 'ఏసియావిజన్ అవార్డు'(2014), 'కన్నదాసన్ అవార్డు'(2014), 'రేయిన్‌డ్రాప్స్ మహిళ అచీవర్స్ అవార్డు'(2015), 'రెడ్ యఫ్‌యం అవార్డు'(2016), 'వనిత ఫిలిమ్ అవార్డు'(2017), 'ఘంటసాల జాతీయ పురస్కారం'(2017), 'నార్త్ అమెరికా అవార్డు'(2017), 'యం. యస్. సుబ్బలక్ష్మి అవార్డు'(2018), 'సింగపూర్ ప్రవాసీ పురస్కారం'(2018) లాంటి అనేక అవార్డులతో పాటు 2004లో 'కముకర', 2007లో 'సౌత్ ఇండియన్ మీరా' బిరుదులను కూడా పొందారు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఛత్రపతి శివాజీ సొంతూరు శివనేరి నుంచి బీఆర్ఎస్ ఎన్నికల యాత్ర



నాందేడ్ ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )మరాఠా పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ సొంతూరు శివనేరి నుంచి బీఆర్ఎస్ ఎన్నికల యాత్రను పది రోజుల్లో ప్రారంభిస్తుందని కేసీఆర్ వెల్లడించారు. ఈ దేశంలో కిసాన్ సర్కార్ రావాలని ప్రతిజ్ఞ చేసి, యాత్రను ప్రారంభిస్తామన్నారు. రాఠా పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ సొంతూరు శివనేరి నుంచి భారత్ రాష్ట్ర సమితి ఎన్నికల యాత్రను పది రోజుల్లో ప్రారంభిస్తుందని ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ వెల్లడించారు. ఈ దేశంలో కిసాన్ సర్కార్ రావాలని శివాజీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేసి, యాత్రను ప్రారంభిస్తామన్నారు. నాందేడ్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న గురుగోవింద్ సింగ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకేసారి యాత్ర ప్రారంభం అవుతుందన్నారు కేసీఆర్. అన్ని నియోజకవర్గాలకు ఒకేసారి బీఆర్ఎస్ వాహనాలు వస్తాయన్నారు. మహారాష్ట్రలో ఊరూరా బీఆర్ఎస్ కిసాన్ కమిటీలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తాను కూడా ఉత్తర మహారాష్ట్ర, పశ్చిమ మహారాష్ట్ర, విదర్భ ప్రాంతాల్లో పర్యటిస్తానని కేసీఆర్ చెప్పారు. రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తెలంగాణలో అమలయ్యే ప్రతీ పథకం మహారాష్ట్రలో అమలవుతుందని కేసీఆర్ హామీ ఇచ్చారు. తన శక్తి ఉన్నంత వరకు ఈ దేశం బాగు కోసం పోరాడుతానని కేసీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ తన ప్రసంగం ముగించే ముందు.. జై మహారాష్ట్ర.. జై భారత్.. జై హింద్ అని పేర్కొన్నారు.

మేకిన్ ఇండియా జోకిన్ ఇండియాగా మారింది :సిఎం కెసిఆర్

మేకిన్ ఇండియా జోకిన్ ఇండియాగా మారిందని బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మండిపడ్డారు. మహారాష్ట్ర నాందేడ్‌లోని గురుగోవింద్ సింగ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై మండిపడ్డారు. 54 సంవత్సరాలు దేశాన్ని కాంగ్రెస్, 16 సంవత్సరాలు బీజేపీ పార్టీలు పాలించాయని, రెండు పార్టీలు ఏం సాధించాయని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు పరస్పరం అవినీతి ఆలోచనలు చేసుకుంటున్నాయని ధ్వజమెత్తారు. నువ్వు అంత తిన్నావంటే.. నువ్వు ఇంత తిన్నావంటూ కాంగ్రెస్, బీజేపీ తిట్టుకుంటున్నాయని విమర్శించారు. ఈ వెనుకబాటు తనానికి ఈ రెండు పార్టీలే కారణం. ఒకరు అంబానీ అంటే మరొకరు ఆదానీ అంటారని ఆరోపించారు. చిన్నచిన్న పట్టణాల్లోనూ చైనాబజార్లు ఎందుకు ఉన్నాయని నిలదీశారు. మాంజాలు, పతంగులు, దైవ ప్రతిమలు, చివరకు జాతీయ జెండాలు కూడా చైనా నుంచే వస్తున్నాయన్నారు. దేశమంతా చైనా బజార్లు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. చైనా బజార్లు పోయి భారత్ బజార్లు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. నాందేడ్‌లో ఎన్ని చైనాబజార్‌లు ఉన్నాయో లెక్కబెట్టారా? ప్రశ్నించారు. ప్రధాని మన్‌కీ భారత్ పేరుతో ప్రజలను వంచిస్తున్నారని, ఇది రాజకీయం కాదు.. ఇది జీవన్మరణ సమస్య అన్నారు.

దేశ స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 4.10 లక్షల మెగావాట్లు..

నాందేడ్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ సభలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ బీజేపీ వైఫల్యాలను విడమరిచి చెప్పారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, పాలన వైఫల్యం, మోదీ సర్కారు నిర్వాకాన్ని ఎండ గట్టారు. ప్రధానంగా దేశ విద్యుత్తు రంగంలో మోదీ ప్రభుత్వం విఫలమైన తీరును గణాంకాలతో సహా వివరించారు. దేశంలో స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 4,10,339 మెగావాట్లు ఉన్నా విద్యుత్తు కోతలు ఎందుకు ఉన్నాయని కేంద్రాన్ని సూటిగా ప్రశ్నిస్తూ గత డిసెంబర్ వరకు గణాంకాలను వివరించారు.

మూలకు 34 థర్మల్ విద్యుత్తు ప్లాంట్లు

దేశవ్యాప్తంగా 34 థర్మల్ విద్యుత్తు ప్లాంట్లు మూలనపడ్డాయి. వీటి సామర్థ్యం అక్షరాల 40,130 మెగావాట్లు. మూలకుపడిన వాటి లో మహారాష్ట్రలో 4, ఛత్తీస్‌గఢ్‌లో 10, ఒడిశాలో 5, ఉత్తరప్రదేశ్‌లో 2, మధ్యప్రదేశ్‌లో 3 ఉన్నాయి. ఇవేగాక మరికొన్ని రాష్ట్రాల్లోనూ థర్మల్ విద్యుత్తు ప్లాంట్లు ఏండ్ల తరబడి పనిచేయడం లేదు. ఈ ప్లాంట్లకు కోల్ లింకేజీ లేకపోవడంతోపాటు నిబంధనలు పాటించకపోవడం, పర్యావరణ అనుమతులు ఇవ్వకపోవడం, ఆర్థిక సమస్యల వల్ల ప్లాంట్లలో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. దేశంలో బొగ్గు నిల్వలు పుష్కలంగా ఉన్నా ఈ ప్లాంట్లను వినియోగంలోకి తేవడంలో కేంద్రం విఫలమైందని, ఫలితంగా దేశంలో పలు ప్రాంతాల్లో విద్యుత్తు కోతలున్నట్టు సీఎం కేసీఆర్ పునరుద్ఘాటించారు.

114 ఏండ్లకు సరిపోయే బొగ్గునిల్వలు

దేశంలో 114 ఏండ్లకు సరిపోయే బొగ్గు నిల్వలున్నాయి. మొత్తం 361 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలుండగా, అందులో థర్మల్ విద్యుత్తు ప్లాంట్లకు అనుకూలమైనవి 180 బిలియన్ టన్నులు. ఏడాదిలో ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తికి 5,256 మెట్రిక్ టన్నుల బొగ్గు వినియోగం ఉంటుంది. ఈ లెక్కన దేశం మొత్తంలో ఏటా 3 లక్షల మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ప్లాంట్లను నడిపిస్తే.. 180 బిలియన్ టన్నుల బొగ్గును పూర్తిగా వినియోగించడానికి 114 ఏండ్ల సమయం పడుతుంది. అంటే 114 ఏండ్లపాటు విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు.

# ఎన్‌ఆర్‌ఐలు దేశంలో ఉండే పాత విధానాన్ని తిరిగి తీసుకురండి

## - కేంద్ర ఆర్థిక మంత్రి కి ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి విజ్ఞప్తి

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రేస్స్ న్యూస్ ) ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి సంచలన పిలుపునిచ్చాడు. ప్రవాస భారతీయులు (ఎన్‌ఆర్‌ఐలు) 183 రోజులపాటు దేశంలో ఉండేందుకు అనుమతించే పాత విధానాన్ని తిరిగి తీసుకురావాలని నారాయణ మూర్తి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్కు విజ్ఞప్తి చేశారు. హుబ్బళ్లిలో జరిగిన దేశ్పాండే ఫౌండేషన్ 14వ 'డెవలప్మెంట్ డైలాగ్' సదస్సులో మూర్తి ప్రసంగిస్తూ.. 'అవసరం లేకపోయినా ఎన్నారైలు భారతదేశం బాగుపడాలనే తపనతో ఉన్నారని అదే కారణంతో ఇక్కడకు వచ్చి గడుపుతున్నారని.. వారికి వీలు కల్పించేలా చట్టాలు మార్చాలంటూ' కేంద్రాన్ని కోరారు. ఎన్నారైలను స్వాగతించాలని రాజకీయ నాయకత్వానికి అధికార వర్గాలకు తన అభ్యర్థన అని మూర్తి పేర్కొన్నారు. "వారు విపరీతమైన విలువతో వస్తారు... మనం వారిని ముక్తకంఠంతో స్వాగతించాలి మరియు వారి కోసం ఘర్షణలను తగ్గించాలి" అని ఆయన అన్నారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఎన్నారైల బసను 183 రోజుల నుంచి 120 రోజులకు కుదించాలని తీసుకున్న నిర్ణయం వల్ల భారతీయ సమాజాభివృద్ధికి పాటుపడే 63 రోజుల ఎన్నారైల ఉనికిని దేశం కోల్పోయేలా చేసిందని మూర్తి అన్నారు. "ఈ విషయంలో పాత పాలనను తిరిగి తీసుకురావాలని.. స్థానిక ప్రజల జీవితాన్ని మెరుగుపరిచే ఎన్నారైలు ఎక్కువ కాలం ఉండటానికి అనుమతించాలని కేంద్ర ఆర్థిక మంత్రికి నా వినయపూర్వకమైన అభ్యర్థన" అని నారాయణమూర్తి అన్నారు. "మంచి విద్య వైద్యం పోషకాహారం షెటర్ని మారుమూల గ్రామంలోని పేద పిల్లలకు అందించాలనే మన దేశాన్ని స్థాపించిన పితామహుల కలలను మార్చే లక్ష్యం ముందుకు తీసుకెళ్లాలన్నారు. అద్భుతమైన విలువలతో వచ్చే ఎన్నారైలను ఆలింగనం చేసుకోవడం ద్వారా వేగంగా వృద్ధి సాధించబడుతుంది." అని మూర్తి పేర్కొన్నారు. ఎన్‌ఆర్‌ఐల బసను 250 రోజులకు పెంచితే తప్పేమీ లేదని వారి ఉనికి వల్ల దేశానికి మేలు జరుగుతుందని అది స్టార్టప్లపైనా ప్రభావం చూపుతుందని నారాయణమూర్తి అన్నారు.




ప్రముఖ రచయిత
కైపు ఆది శేషారెడ్డి గారి ఆర్థిక సహకారంతో ...
విశాలాక్షి సాహిత్య మాసపత్రిక మినీ కథల పోటీ



శ్రీ శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా
మినీ కథల పోటీను సంయుక్తంగా నిర్వహిస్తున్నాము.

బహుమతులు -రూ. 10,000 లు

నిబంధనలు :

1. ఒక్కో కథను రూ.1000/-లు వంతున పది ఉత్తమ కథలకు నగదు బహ్యమతులు
2. మరి కొన్ని సాధారణ ప్రచురణకు స్వీకరించబడును.
3. కథలు విశాలాక్షి సాహిత్య మాస పత్రికలో ప్రచురించబడుతాయి.
4. 500-600 పదాల మధ్య మత్రమే కథ ఉండాలి.
5. డిటిపి లేదా చేతివ్రాత ఎలా అయినా పంపవచ్చు..
6. మెయిల్, వాట్సప్ లలో స్వీకరించబడవు. Post కొరియర్ మీ వసతి మేరకు నేరుగా మాచిరునామాకు పంపవలెను
7. కథ మీద పేరు లాంటి వివరాలు ఉండకూడదు.
8. హామీ పత్రం ప్రత్యేక పేజీలో రాయాలి.
9. చివరి తేది 20-03-2023 లోపు అందాలి

చిరునామా : విశాలాక్షి సాహిత్య మాస పత్రిక
D.No. 27-5-487, పద్మావతి నగర్, బాలాజీ నగర్ చివర,
నెల్లూరు- 524002. Cell : 8008562742


# మచిలీపట్నంలో ఉద్రిక్తత.. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అరెస్టు

అమరావతి, ఫిబ్రవరి 6:కోట్లాది రూపాయాల విలువచేసే ప్రభుత్వ భూమిని వైసీపీ పార్టీ కార్యాలయానికి కేటాయించడంపై కొల్లు రవీంద్ర, కొనకళ్ల బల్లయ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు.

వైసీపీ కార్యాలయ స్థలాన్ని కొల్లు రవీంద్ర మీడియాకు చూపే ప్రయత్నం చేశారు. దీంతో కొల్లు రవీంద్రను పోలీసులు అడ్డుకున్నారు. బల్లయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో పోలీస్ చర్యలను కొల్లు రవీంద్ర, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతిఘటించారు. కొల్లు రవీంద్రను అరెస్టు చేసి గూడూరు వైపు పోలీస్ తరలించారు. దీంతో మచిలీపట్నం లక్ష్మీటాకీస్ సెంటర్ వద్ద ట్రాఫిక్ స్తంభించింది.

# బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మహిళలకు 33 శాతం రిజ్వేషన్లు

నాందేడ్ ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూ న్); భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అధికారంలోకి రాగానే చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజ్వేషన్లు అమలు చేస్తామని ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. నాందేడ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. మహిళల ప్రాతినిధ్యం ఉన్న సమాజం అద్భుతంగా ప్రగతి సాధిస్తుందని సీఎం స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం. ఆ హామీని ఏడాదిలోపే అమలు చేస్తాం. మహిళలను కేంద్రం చిన్నచూపు చూస్తోంది. మహిళల ప్రాతినిధ్యం పెరిగితేనే అభివృద్ధి సాధ్యం. అన్ని రంగాల్లోనూ వారి ప్రాధాన్యం పెంచుతాం. బేటీ పడావో.. బేటీ బచావో మాటలకే పరిమితం అయి ంది. ఉత్తర భారతదేశంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. హత్రస్ ఘటన మహిళలకు రక్షణ లేదని నిరూపించింది అని కేసీఆర్ గుర్తు చేశారు.

# విజయశాంతికి సీటు ఎండమావేనా?

హైదరాబాద్ ఫిబ్రవరి 6(ఎక్స్ ప్రెస్ న్యూ న్);విజయశాంతి.. ఒకప్పుడు ఉద్యమపార్టీలో టీఆర్ఎస్ లో కేసీఆర్ తర్వాత నంబర్ 2 పొజిషన్. కానీ ఇప్పుడు బీజేపీలో ఒక సాధారణ నేత. స్టార్ క్యాంపెయినర్ అన్న పేరే కానీ ఆమెకు వేదికలపై.. సభలు సమావేశాల్లో అంత ప్రాధాన్యం లేదని టాక్ ఉంది.. ఇక కాంగ్రెస్ లోనూ ఇదే కథ అనుభవించి బీజేపీలో చేరిన రాములమ్మకు ఇక్కడ కూడా గుర్తింపు గౌరవం లేదని ఆమె అభిమానులు అంటున్నారు.. బీజేపీ అధిష్టానం ఈమెను పట్టించుకోవడం లేదన్న ఆవేదన ఆమెలో ఉందని ఒక ప్రచారం సాగుతోంది. టీఆర్ఎస్ లో ఉండగా రాములమ్మ మెదక్ ఎంపీగా గెలిచారు. అనంతరం మెదక్ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే టీఆర్ఎస్ ను వీడాక ఆమె గెలవలేకపోయింది. గెలిపించే పార్టీ లేకుండా పోయింది. కాంగ్రెస్ లో చేరి మెదక్ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. ఇప్పుడు బీజేపీలో ఆ సీటు కూడా ఇచ్చే పరిస్థితుల్లో లేరు. ఎందుకంటే విజయశాంతి పరపతి మెదక్ లో లేదు. ఆమె స్థానికురాలు కాదు. సో ఓట్లు పడే ఛాన్స్ లేదు. అందుకే విజయశాంతికి సీటు ఇచ్చినా వృథా అని.. ఆమెను నామినేటెడ్ పదవిలోకి పంపితే బెటర్ అని బీజేపీ ఆలోచిస్తోంది. తాజాగా విజయశాంతి కూడా అదే మాటన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఎలాగైనా సాధించి రాష్ట్ర ప్రజల కళ్లలో ఆనందాన్ని చూడాలనే తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు బీజేపీ నేత విజయశాంతి తెలిపారు. అయితే తెలంగాణ ఏర్పాటుతో కేసీఆర్ ఫ్యామిలీకే లాభం చేకూరిందని మండిపడ్డారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పులకుప్పగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తాను ఎక్కడ పోటీచేసేది బీజేపీ అధిష్టానం డిసైడ్ చేస్తుందని వెల్లడించారు. దీంతో విజయశాంతికి అంటూ ఒక సీటు లేదని అర్థమైంది. ఆమెనే ఈ నిజాన్ని అంగీకరించారు. టీఆర్ఎస్ లో వెలుగువెలిగిన రాములమ్మకు అటు కాంగ్రెస్ లో ఉన్నా.. ఇటు బీజేపీలో ఉన్న గెలుపు కష్టమని తేలిపోయింది. కనీసం బీజేపీలో ఆమెకు పోటీచేసేందుకు సీటు కూడా లేకపోవడమే చర్చనీయాంశమవుతోంది. ఆమె మాటలను బట్టి అదే నిజం అనిపిస్తోంది.

# గంజాయి అక్రమ రవాణా ముఠా గట్టు రట్టు- ఏడుగురు నిందితుల అరెస్టు

కరీంనగర్, ఫిబ్రవరి 6: (నేటినిజం ప్రతినిధి): గంజాయి మాదకద్రవ్యాల వినియోగంతో యువతరం నిర్వీర్యమై, భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్న విషయం గమనించి, తెలంగాణ ప్రభుత్వం మాదకద్రవ్యాల రవాణా వినియోగం పట్ల కఠినంగా వ్యవహరించుటకు ప్రత్యేకమైన విభాగాలను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణ మీదుగా వేరే రాష్ట్రాలకు మరియు తెలంగాణలోని నగరాలకు గంజాయి అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేసేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నది. అంతేకాకుండా ఒకవైపు అక్రమ రవాణాను అడ్డుకొనుటకు పటిష్టమైన చర్యలు చేపడుతూనే మరోవైపుఅక్రమ రవాణాకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటూ వారిపై పిడి ఆక్ట్ లాంటి అస్త్రాన్ని ఉపయోగించి వారిని కటకటాల్లో పెట్టడం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో కూడా గత కొంతకాలంగా గంజాయి ,

మాదకద్రవ్యాల కట్టడికి ఒకవైపు తీవ్రంగా ప్రయత్నిస్తూ మరొకవైపు గంజాయి మరియు మాదకద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే సమస్యల పట్ల యువకులకు మరియు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూవస్తున్నది. అయినా కొంతమంది దారితప్పిన యువత తమ దురలవాట్లకు మరియు స్వలాభం కోసం ఇతర ప్రాంతాల నుండి అక్రమంగా రహస్యంగా గంజాయిని కరీంనగర్ కు తరలించి కొంతమంది యువకులకు అమ్ముతున్నారని కొంతమంది యువకులు దీనిని వినియోగిస్తూ తమ బంగారు భవిష్యత్తును చేజేతులా పాడు చేసుకుంటున్నారని గమనించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బారాయుడు స్థానిక పోలీస్ అధికారులు , టాస్క్ ఫోర్స్ అధికారులను అప్రమత్తం చేశారు. దీనిపై తీవ్రంగా నిఘా పెట్టి టాస్క్ ఫోర్స్ మరియు స్థానిక పోలీస్ అధికారులు సమిష్టిగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాను పకడ్బంది సమాచారంతో పట్టుకోవడం జరిగింది.

నిందితుల నేపథ్యం

కరీంనగర్లో నివాసం ఉంటూ జీవపాధికోసం వివిధ రకాల వృత్తులను చేసుకుంటున్న బెజ్జంకి. మండలం రేగులపల్లి (ప్రస్తుత నివాసం కరీంనగర్లోని ఆదర్శనగర్)కి చెందిన నిషాని హరికృష్ణ (27). ఎలగందలు చెందిన నిషాని సాయికృష్ణ (22), బావుపేటకు చెందిన దూళం అభిరాం (19), నేపాల్ నుండి వచ్చి కిసాన్నగర్లో ఉంటున్న బహదూర్ లక్ష్మణ్ (19), సుభాష్నగర్కు చెందిన యండి అలీ అలియాస్ సోను (26), గత కొంత కాలం నుండి సరస్వతి నగర్ లో ఉంటున్న మంచిర్యాలకు చెందిన గంప గోవర్ధన్ (24), కిసాన్ నగర్ కు చెందిన చెల్పూరి విలాస్ (22)లు వివిధ రకాల వృత్తులను చేసుకుంటూ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు. వీరందరూ గత కొంతకాలం నుండి గంజాయిని సేవిస్తూ చేస్తున్న జల్సాలకు డబ్బులు సరిపోకపోవడం. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఇతర ప్రాంతాల నుండి గంజాయిని కొనుగోలు చేసి కరీంనగర్ చుట్టుపక్క ప్రాంతాలలో విక్రయాలకు పాల్పడుతున్నారు. వివిధ రకాల వృత్తులు చేసుకుంటూ జీవనోపాధిని కొనసాగిస్తున్న కూలీలు, ఆటోడ్రైవర్లు, గంజాయికి అలవాటుపడిన బానిస యువకులు, విద్యార్థులకు అధికధరలకు విక్రయిస్తూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులను సంపాదిస్తూ జల్సాలకు పాల్పడుతున్నారు. గంజాయి సేవించడం ద్వారా ఏర్పడిన పరిచయాలతో తూర్పు గోదావరిజిల్లా సీలేరు ప్రాంతానికి చెందిన సుబ్బారావు నుండి కొనుగోలు చేసుకుని వస్తున్నారు. వారంరోజుల క్రితం దిగుమతి చేసుకున్న 20కిలోల గంజాయిని వీరు రెండు బృందాలుగా ఏర్పడి17 కిలోల గంజాయిని విక్రయించారు.

### గత 3సంవత్సరాలుగా విక్రయాలు

పైన పేర్కొన్న నిందితులో నిషాని హరికృష్ణ, బహదూర్ లక్ష్మణ్ లు ఈ విక్రయాలు కొనసాగించాలని నిర్ణయించి తమతో పనిచేస్తున్న ఇతర సభ్యులను ఇందులో చేర్చుకుని అక్రమంగా గంజాయి విక్రయాలను గత 3సంవత్సరాల నుండి కొనసాగిస్తున్నారు.



### పట్టుబడిన విధానం

'గంజాయిని అక్రమంగా ఇతర ప్రాంతాల నుండి తీసుకు వస్తున్న ముఠాల పై నిఘా తీవ్రం చేసిన కరీంనగర్ పోలీసులు రెండు గ్రూపులు గా ఏర్పడి గంజాయి విక్రయిస్తున్న బహదూర్ లక్ష్మణ్, యండి అలీ అలియాస్ సోను, గంప గోవర్ధన్, చెల్పూరి విలాస్ ల గ్రూపును కిసాన్ నగర్ ప్రాంతంలోని శివాజీనగర్ లో వల పన్ని పట్టుకున్నారు. వీరివద్ద నుండి 45వేల రూపాయల విలువచేసే 15కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిషాని హరికృష్ణ, నిషాని సాయికృష్ణ, దూలం అభిరాంల గ్రూపును మల్కాపూర్ శివారులో పట్టుకున్నారు. వీరివద్ద నుండి 45వేల రూపాయల విలువచేసే 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

### గతంలో పట్టుబడిన నిందితుల సంఖ్య

గత సంవత్సరం కాలం లో కరీంనగర్ కమిషనరేట్ పరిధి లో గంజాయి విక్రయిస్తు యువతనుపెడధారి పట్టిస్తున్న గంజాయి విక్రయదారుల పై నిఘా పెట్టి (22) కేసులలో (52) మందిని అరెస్టు చేసి, వారి వద్దనుండి 33.91కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కటకటాల వెనక్కి పంపడం జరిగింది.

### పిడి ఆక్ట్ పెట్టిన వారి సంఖ్య

గంజాయి విక్రయాలకు అడ్డు కట్ట వేసి, నిందితుల పై ఉక్కు పాదం మోపాలనే ధ్యేయం తో ఉన్న కరీంనగర్ పోలీసులు ఇప్పటి వరకు గంజాయి కేసులలో అరెస్టు అయిన (108) మంది పై పిడి ఆక్ట్ పెట్టి నిర్భంధించినారు.

### స్వాధీనం చేసుకున్న గంజాయి వివరములు

1) 3 కిలోల గంజాయి.

2) 2 ద్విచక్ర వాహనాలు 3)7 సెల్ఫోన్లు

గంజాయి విక్రయాలకు పాల్పడినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బరాయుడు తీవ్రంగా హెచ్చరించారు. ఇదివరకు పట్టుబడిన నిందితుతల వద్ద నుండి నగరంలో గంజాయి అమ్మేవారు మరియు సేవించేవారి వివరాలు పోలీస్ స్టేషన్ల వారిగా తెలుసుకోవడం జరిగింది. వారిపైన నిరంతరమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఇకపై ఎవరైనా గంజాయితో పట్టుబడినా.. తీరుమార్చుకోకుండా మళ్లీ అదే తరహా నేరాలకు పాల్పడినా వారిపై పీడీయాక్టును అమలు చేస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లో ఉంటూ ఇక్కడి వారికి గంజాయి సరఫరా చేస్తున్న వారి వివరాలు కూడా. తెలుసుకోవడం జరిగింది. వారిపై కూడ కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు .

### గంజాయి రహిత కరీంనగర్ లక్ష్యంగా

గంజాయి విక్రయదారులు మరియు సేవించేవారి వివరాలు సేకరించి జాబితా తయారు చేయడం జరిగింది. త్వరలో వారిని వారి కుటుంబసభ్యుల సమక్షంలో సైకాజిస్ట్, సామాజికవేత్త మరియు డాక్టర్ల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుంది. వీటి తర్వాత కూడా ఎవరైనా గంజాయి సేవించినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకోక తప్పదని స్పష్టం చేశారు. గంజాయి రహిత కరీంనగర్ ఏర్పాటులో మీడియా ప్రజలు, మీడియా ప్రతినిధులు, ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్ళు మరియు కళాశాలల యాజమాన్య సహకరించాలని కోరారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు పోలీసు వారికి తెలియజేసి సహకరించి ' డ్రగ్ ఫ్రీ కరీంనగర్ ' ఏర్పాటు చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు .ముఠా ను చేదించడంలో శ్రమించిన పోలీస్ అధికారులు

ఈ దాడుల్లో పాల్గొన్న టాస్క్ ఫోర్స్, కొత్తపల్లి, కరీంనగర్ త్రీటౌన్ పోలీసు అధికారులు , సిబ్బందిని సిపి అభినందించారు.

# వైసీపీ కీలక నేత వైబోగుల శ్రీనివాస్ రాజీనామా

అమరావతి/కాకినాడ : వైసీపీలో గత నెలరోజులుగా జరుగుతున్న పరిణామాలు పార్టీ పెద్దలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ఒకరి తర్వాత ఒకరు ఎమ్మెల్యేలు అసంతృప్తి గళం వినిపించడం.. మరోవైపు ద్వితియ శ్రేణి నేతలనుంచి ఎమ్మెల్యేలకు షాక్‌లు వస్తుండటంతో అసలు అధికార పార్టీలో ఏం జరుగుతోందో అధిష్టానానికి అర్థం కాని పరిస్థితి. నిన్న, మొన్నటి వరకు ఎమ్మెల్యేలు రెబల్స్‌గానే మారారు అనుకుంటే ఇప్పుడు ఏకంగా ఎమ్మెల్యేల రైట్ హ్యాండ్‌గా చెప్పుకునే ప్రధాన అనుచరులు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు రాజీనామా చేసేస్తున్నారు. ఇప్పటికే పలువురు నేతలు రాజీనామా చేసి పార్టీ నుంచి బయటికొచ్చేయగా.. తాజాగా కాకినాడకు చెందిన ఓ కీలక నేత వైసీపీకి రాజీనామా చేశారు. జగ్గంపేట వైసీపీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు ముఖ్య అనుచరుడు షాకిచ్చారు. ఎమ్మెల్యేకు రైట్ హ్యాండ్‌గా, ప్రధాన అనుచరుడిగా ఉన్న వైబోగుల శ్రీనివాస్ వైసీపీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే సొంత మండలమైన జగ్గంపేటలోనే టీడీపీ నేతలు జ్యోతుల నెహ్రూ జ్యోతుల నవీన్ కుమార్ సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు పలువురు ద్వితియశ్రేణి వైసీపీ నేతలు టీడీపీ కండువా కప్పుకున్నారు. యాదవ సంఘం అంతా చంద్రబాబుకు ఉంటుందని శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. అయితే నియోజకవర్గంలో శ్రీనివాస్ కీలకంగా వ్యవహరించేవారని.. చంటిబాబు గెలుపులో ప్రధాన పాత్ర పోషించారని స్థానిక నేతలు చెబుతున్నారు. నియోజకవర్గంలో కీలక నేత అయిన వైబోగుల పార్టీని వీడటం ఎమ్మెల్యేకు గట్టి షాకేనని.. రానున్న ఎన్నికల్లో ప్రభావమేంటో తెలుస్తుందని కొందరు నేతలు చెప్పుకుంటున్నారు. ఇదే కాకినాడలో గొల్లప్రోలు మండలం కొడవలిలో మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో భారీగానే చేరికలు జరిగాయి. సుమారుగా వైసీపీకి చెందిన 50 మంది ముఖ్య కార్యకర్తలు జఅఖకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరారు.

# ప్రాజెక్టుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.. ప్రజా చైతన్య యాత్రలో సునీల్ రెడ్డి



వరంగల్, ఫిబ్రవరి 6:కాళేశ్వరం ప్రాజెక్టుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, చిన్న కాళేశ్వరం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు చందుపట్ల సునీల్ రెడ్డి డిమాండ్ చేశారు. జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, కన్న పెల్లి, బీర సాగర్ గ్రామాలలో సోమవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రెండో రోజు ప్రజా చైతన్య యాత్ర కొనసాగుతోంది. యాత్రలో భాగంగా సునీల్ రెడ్డి ఇంటి ఇంటికి తిరుగుతూ కష్టసుఖాలను అడిగి తెలుసుకుంటున్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు

. గ్రామాలలో జెండాలను ఆవిష్కరణ చేస్తూ , బైక్ ర్యాలీ లు తీశారు. కన్నెపల్లి గ్రామం లో సుమారు 50 మంది యువకులు సునీల్ సమక్షంలో బీజేపీ పార్టీ లో చేరారు. అనంతరం సునీల్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు లోని కీలకమైన కన్నెపల్లి పంప్ హౌస్ నిర్మాణం కొరకు కన్నెపెల్లి గ్రామంలోని రైతులు తమ విలువైన భూములను ఇచ్చారు. ఎకరానికి ఐదు లక్షలు నష్టపరిహారం చెల్లించి తమ భూములను లాక్కొని రైతులను ప్రభుత్వం విస్మరిసతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

కాటారం, మహాదేవపూర్ మలహర్, మహా ముత్తారం మండలాల్లోని సుమారు 40000 ఎకరాలకు సాగునీరు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం చేపట్టడం జరిగింది. ఇప్పటివరకు ఆ ప్రాజెక్ట నిర్మాణం పూర్తి చేయకపోవడం శోచనీయమని అన్నారు. తక్షణమే త్వరితగతిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రలో వారి వెంట మంథని మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి, యాత్ర ప్రముఖ్ వెన్నం పెల్లి పాపయ్య, మంథని నియోజకవర్గ ప్రబరి కాటంగురి అనిల్ రెడ్డి, మండల అధ్యక్షుడు సిరిపురం శ్రీమన్నారాయణ, యాత్ర సహ ప్రముఖ్, దుర్గం తిరుపతి, మండల ఇంచార్జ్ ఉడుముల విజయ రెడ్డి, వివిధ మండల అధ్యక్షులు బొమ్మన భాస్కర్ రెడ్డి, మల్కా మోహన్ రావ్, పిలుమరి సంపత్, పార్లమెంట్ ఐటీ సెల్ కన్వీనర్ భీమారపు సంపత్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగే రంజిత్, మండల ప్రధాన కార్యదర్శిలు బొల్లం కిషన్, సూరం మహేష్, మంథని రాజేందర్, గంట అంకన్న, పూసల రాజేంద్రప్రసాద్, మేడిపల్లి పూర్ణచందర్ పాల్గొన్నారు.

# సికిల్ సెల్ వ్యాధి కోసం 9,93,114 మందికి పరీక్షలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:సిక్కల్ సెల్ డిసీజ్ (ఎస్‌సిడి) వ్యాధి అనేది దీర్ఘకాలిక రక్తహీనత, తీవ్రమైన బాధాకర ఘటనలు, అవయవ అవస్థాపన (న్ఫాక్షన్), దీర్ఘకాలిక అవయవ నష్టం, ఆయుర్దాయం గణనీయంగా తగ్గడం వంటి లక్షణాల ద్వారా శరీరాన్ని బలహీనపరిచే ఇది ఒక జన్యు రుగ్మత.

జాతీయ ఆరోగ్య మిషన్ కింద భారత ప్రభుత్వం వార్షిక పిఐపి ప్రతిపాదనలకు అనుగుణంగా ఈ సికిల్ సెల్ వ్యాధిని నివారించి, నిర్వహించేందుకు రాష్ట్రాలకు తోడ్పాటునందిస్తుంది. సికిల్ సెల్ రక్త అనీమియా సహా హెమోగ్లోబినోపాథీస్ నివారణ, నియంత్రణకు 2016లో మంత్రిత్వ శాఖ సాంకేతిక కార్యాచరణ మార్గదర్శనాలను విడుదల చేసింది. ఇక చికిత్స విషయంలో, ఎన్‌హెచ్‌ఎం కింద హైడ్రోక్సూరియా కాప్సూల్స్‌ను ఇవ్వడమే కాక , రాష్ట్రాల ప్రతిపాదనలకు అనుగుణంగా అందరు సికిల్ సెల్ రోగులు (పురుషులు ఒ మహిళలు) కు ఉచిత రక్త మార్పిడిని చేసేందుకు తోడ్పాటు ఇస్తోంది.

కేంద్ర బడ్జెట్ 2023-24లో, సికిల్ సెల్ అనీమియాను 2047 నాటికి పూర్తిగా నిర్మూలించేందుకు ఒక మిషన్‌ను ప్రారంభించనున్నట్టు ప్రకటించారు.

ఈ మిషన్ వ్యాధిపట్ల అవగాహన కల్పించడం, ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో 0-40 ఏళ్ళ మధ్య వయస్సున్న సుమారు ఏడు కోట్ల మంది ప్రజలను పరీక్షించడం, కేంద్ర మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ ప్రయత్నాల ద్వారా కౌన్సిలింగ్ ఇవ్వడంపై దృష్టి సారించింది.

సికిల్ సెల్ డిసీజ్‌ను గుర్తించి, పరీక్షించి, నిర్వహించడంలోని సవాళ్ళను నిర్వహించేందుకు మధ్యప్రదేశ్‌లో రాష్ట్ర హిమోగ్లోబినోపతీ మిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. గౌరవనీయ ప్రధానమంత్రి 15 నవంబర్ 2021న మధ్యప్రదేశ్‌లోని అలిరాజ్‌పూర్ జిల్లాలోని ఝుబువాలో వ్యాధిని గుర్తించేందు ఒక పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు.

ప్రాజెక్టు రెండవ దశలో 89 గిరిజన బ్లాకులను జోడించారు. రాష్ట్ర నివేదికల ప్రకారం మొత్తం 993114 వ్యక్తులను గుర్తించి పరీక్షించారు. వారిలో 18866కు హెచ్‌బిఎఎస్ (సికిల్ లక్షణం), 1506 (హెచ్‌బిఎస్ఎస్ సికిల్ వ్యాధి సోకినట్టు) గుర్తించారు.

రోగుల వ్యాధిని నిర్ధారించి, చికిత్స చేసేందుకు 22 గిరిజన జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ సెంటర్ ఫర్ హీమోఫీలియా, హిమోగ్లోబినోపతీస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఈ సమాచారాన్ని శుక్రవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ వెల్లడించారు.

# పల్లెకు పట్టం కట్టిన బడ్జెట్ : మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్, ఫిబ్రవరి 6: తెలంగాణ బడ్జెట్ పల్లెకు పట్టం కట్టిందని, ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టేలా ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తూ ఏటేటా బడ్జెట్ నిధులను పెంచుకుంటూ సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ ఏడాది రూ.2,90,396కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా.. ఇందులో సింహభాగం రూ.32,426కోట్ల పంచాయతీరాజ్‌శాఖకు కేటాయించినందుకు సీఎం కేసీఆర్, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆసరా పింఛన్లకు రూ.12వేలకోట్లు, మిషన్ భగీరథకు రూ.600కోట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ చెప్పిన పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు అన్న మాటలను సీఎం కేసీఆర్ ఆచరణలో పెడుతున్నారన్నారు. పల్లె ప్రగతితో తెలంగాణ పల్లెలను ప్రగతి కేంద్రాలుగా తీర్చిదిద్దారని, ప్రస్తుతం తెలంగాణ పల్లెలు దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు పొంది తెలంగాణ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేశాయన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో 13 జాతీయ అవార్డులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. దెబ్బతిన్న పంచాయతీరాజ్ పాత రోడ్ల మరమ్మతులు, నిర్వహణ కోసం బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు ప్రతిపాదించడంపై హర్షం వ్యక్తం చేశారు.

# డంప్ యార్డు కాలుష్యంతో ఎముకల గూళ్ళగా మారుతున్నా ప్రజలు

## - మేడ్చల్ నియోజకవర్గం బిజెపి నేత కొంపల్లి మోహన్ రెడ్డి ఆందోళన
## - సమస్య పరిష్కారానికి పోస్ట్ కార్డు ఉద్యమానికి పిలుపు





మేడ్చల్ ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మేడ్చల్ నియోజకవర్గం లోని జవహర్ నగర్ డంప్ యార్డు కాలుష్యం మూలంగా డంప్ యార్డు పరిసర ప్రాంతాలలోని ప్రజల బ్రతుకులు ఎముకల గూళ్ళగా మారుతున్నాయని మేడ్చల్ నియోజకవర్గం బిజెపి నేత కొంపల్లి మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేసారు. ఈ మేరకు జవహర్ నగర్ డంప్ యార్డు కాలుష్యం బారిన పడుతున్న దమ్మాయిగూడ పట్టణ ప్రజానీకానికి ఆయన భహిరంగ లేఖ రాసారు. అనేక ఏళ్లుగా పాలకులుగా ఉంటున్నవారు కండువాలు మార్చి బోగా,భాగ్యాలు, అనుభవిస్తున్నారు కానీ వారికి ప్రజల ద్వారనే ఆ పదవులు,వచ్చాయి అనే కనీస ఇంగితజ్ఞానం లేకుండా ఒక్కో సమస్యను తరాల తరబడి నాన్చుతూ ఉండడంవల్ల ఈ ప్రాంతంలో నివసించే మీ' అందరి జీవితం అన్ని రకాల కాలుష్యాలతో సావాసం చేస్తూ శరీరంలో ఉన్న అన్ని అవయవాలకు దీర్ఘ కాలిక వ్యాధులు సంభవిస్తూ ఈ జీవితాలు ఎముకల గూళ్ళ లాగా తయారవుతున్నాయని పేర్కొన్నారు.

ఈ విషయం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉంది,ఈ దుర్భర జీవితాన్ని మార్చడంలో శాసనవ్యవస్థ ఎమ్మేల్యేలు - మరియు కార్యనిర్వహక వ్యవస్థ (అధికారులు) నిర్ణయాలు తీసుకొని మీ జీవితాలలో వెలుగులు నింపే విషయంలో పాలసీ పెరాలసిస్ (నిర్ణయాల అమలులో పక్షవాతం)లా ఈ డంప్ యార్డు వల్ల ఏర్పడే కాలుష్య సమస్యలకు పరష్కారం లభించడం లేదని మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

నేను ఈ సమస్యపై మా బిజెపి పార్టీ పక్షాన దశాబ్దాలుగా అనేక ప్రజా పోరాటాలు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో మీ'జీవన ఘోషను వినిపించి డంప్ యార్డును ఎత్తివేసే దిశగా ఉత్తర్వులు తెచ్చినా.. పాలకుడికి ప్రజల కన్నా వరాయి పెట్టుబడిదారుల ప్రయోజనాలే ముఖ్యం అయినాయని పేర్కొన్నారు.ఇక ఈ సమస్యను చెడుపై మంచి గెలిచిన నరకాసుర సంహారం చేసిన విధంగా గెలిచి మీ' జీవితాల్లో దీపావళి వెలుగులు నిండాలి అంటే ప్రజాస్వామ్యంలో 4 స్థంభాల్లాంటి రెండు వ్యవస్థలు శాసనవ్యవస్థ (ఎమ్మేల్యేలు) మరియు కార్యనిర్వహక వ్యవస్థ (అధికారులు) విఫలం అయినా!! మిగిలిన 2 వ్యవస్థలు న్యాయ వ్యవస్థ మరియు పాత్రికేయ వ్యవస్థ ఇప్పటికీ క్రియాశీలకంగా ఉంటూ ప్రజల పక్షాన నిలుస్తున్నాయి కాబట్టి..!మీ సమస్యలను ఆ రెండు వ్యవస్థల గుండెను చేరి అంతిమ విజయం సాధించేలా మీ మున్సిపాలిటిలోని ప్రతీ పౌరుడు కాలుష్య కోరల్లో చిక్కుకున్న తమ గోడును రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గారికి ఉత్తరాల ద్వారా తెలియజేసే కార్యక్రమాన్ని చేపడదామని అని మీ అందరితో మనవి చేస్తున్నాని పేర్కొన్నారు. స్వాతంత్రోద్యమ కాలంలో దేశం కొరకు వీరోచితంగా పోరాడిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ గారు విశ్వసించిన ఉన్నత ఆశయంతో ఉద్యమిస్తే,అపజయం కూడా దిగ్విజయం అవుతుంది అన్న మాటలే మన ఈ పోస్ట్ కార్డు ఉద్యమానికి కొంపల్లి మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# సీఎం జగన్ వ్యాఖ్యలు కోర్టు ఆఫ్ కంటెప్ట్ పరిధిలోకి వస్తాయి

## - సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ సంచలన వ్యాఖ్యలు

అమరావతి ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సన్నాహక సదస్సులో పాల్గొన్న ఏపీ సీఎం వైఎస్ జగన్ రాజధానిపై సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తాను త్వరలోనే విశాఖపట్నానికి షిఫ్టు అవుతున్నానని వెల్లడించారు. అక్కడి నుంచే పరిపాలన సాగిస్తానని తెలిపారు. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులు పారిశ్రామిక వేత్తలు విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టాలని సీఎం జగన్ కోరారు.సీఎం జగన్ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. జగన్ మూడు రాజధానులు ఏర్పాటు చేస్తూ తెచ్చిన జీవోలను హైకోర్టు కొట్టేసింది. దీంతో జగన్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో రాజధాని అంశంపై విచారణ సాగుతోంది. కోర్టు పరిధిలో రాజధాని అంశం ఉన్నప్పుడు జగన్ రాజధాని అంశంపై వ్యాఖ్యలు ఎందుకు చేస్తారని ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. జగన్ వ్యాఖ్యలపై కోర్టు ధిక్కరణ కింద సుప్రీంకోర్టుకు లేఖ రాస్తానని జై భీమ్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ తెలిపారు.

మరోవైపు సీఎం జగన్ త్వరలోనే విశాఖకు షిఫ్టు అవుతానని చేసిన వ్యాఖ్యలపై సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజధాని అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. సీఎం జగన్ వ్యాఖ్యలు కోర్టు ఆఫ్ కంటెప్ట్ పరిధిలోకి వస్తాయన్నారు. రాజధాని అంశం కోర్టు పరిధిలో ఉన్నప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని లక్ష్మీనారాయణ తెలిపారు. కాగా సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో జగన్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. ఇతరుల మొబైల్ ఫోన్లను ట్యాపింగ్ చేయడం అంత సులువు కాదని ఆయన అన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) రా వంటి అత్యున్నత ఏజెన్సీలకు మాత్రమే ఎవరి టెలిఫోన్నైనా ట్యాప్ చేసే అధికారం ఉంటుందని తెలిపారు. అవన్నీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని.. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో లేవని స్పష్టం చేశారు.

ఈ ఏజెన్సీలు కూడా ఏ నిర్ణయం తీసుకోవాలన్నా కేంద్ర హోంశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని లక్ష్మీనారాయణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా టెలిఫోన్ ట్యాపింగ్ చేయగలిగినప్పటికీ.. అయితే అసాధారణమైన పరిస్థితులలో మాత్రమే చేయగలదన్నారు. అది కూడా కేంద్ర హోం కార్యదర్శి అనుమతితో మాత్రమేనని చెప్పారు.

అయితే అసాధారణ పరిస్థితుల్లో ఇచ్చిన ట్యాపింగ్ అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసే అవకాశం కూడా ఉందన్నారు. రాజకీయ కారణాలతో ట్యాపింగ్ జరిగితే అది ఖచ్చితంగా చట్టవిరుద్ధమని లక్ష్మీనారాయణ తేల్చిచెప్పారు.

అదే సమయంలో.. కేంద్రం నుండి అనుమతి తీసుకోకుండానే రాష్ట్ర ప్రభుత్వాలు తరచుగా ప్రైవేట్ సంస్థల నుంచి ట్యాపింగ్ పరికరాలను కొనుగోలు చేస్తున్నాయని లక్ష్మీనారాయణ తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందన్నారు.

కాగా ఇటీవల రోడ్లపై బహిరంగ సభలు సమావేశాలు ర్యాలీలు రోడ్ షోలను నిషేధిస్తూ జగన్ ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 1కు అనుకూలంగానూ జేడీ లక్ష్మీనారాయణ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

# తేలని టిఎస్ఆర్టీసీతో పంచాయితీ..

అమరావతి, ఫిబ్రవరి 6:ఒక్క తెలంగాణ మినహా పొరుగు రాష్ట్రాల్లో ఆర్టీసీ బస్సుల సంఖ్యకు సానుకూలత వ్యక్తమవుతోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తమిళనాడు, కర్నాటక, ఒడిశా రాష్ట్రాల రవాణా సంస్థలు బస్సులు నడిపేందుకు ముందుకొచ్చాయి. గతంలోనే తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణాతో అంతరాష్ట్ర సర్వీసుల సమస్య పరిష్కారం కాగా..గత డిసెంబర్‌లో ఒడిశా రాష్ట్ర రవాణా సంస్థ కూడా ఏపీఎస్ ఆర్టీసీ అధికారులతో ఒప్పందం చేసుకుంది. మూడు రోజుల కిందట అదనపు కిలో మీటర్లు బస్సులు నడిపేందుకు కర్నాటక ఉన్నతాధికారులు వచ్చి అదనంగా అంతరాష్ట్ర సర్వీసుల నిర్వహణకు ఒప్పందం చేసుకొని వెళ్లారు. కొత్త ఒప్పందం ప్రకారం కర్నాటకలో ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు 69,284 కిలో మీటర్లలో 327 అదనపు బస్సులు నడవబోతుండగా..ఏపీ భూభాగంలో కర్నాటక రవాణా సంస్థ బస్సులు 69,372 కిలో మీటర్లలో 496 బస్సులు నడపనుంది. అన్ని రవాణా సంస్థలు ముందుకొస్తున్నప్పటికీ.. తెలంగాణ ఆర్టీసీ అధికారులు మాత్రం ముందుకు రావడం లేదని అధికారులు చెపుతున్నారు. కోవిడ్ కు ముందు తెలుగు రాష్ట్రాల్లో ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు లక్షా 65వేల కిలో మీటర్ల పరిధిలో తిరిగేవి. తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణికుల రాకపోకలు అధికంగా ఉండటంతో..అంతకంటే కిలో మీటర్లు, సర్వీసుల సంఖ్య పెంచాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ క్రమంలోనే కోవిడ్-19 నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆంక్షలతో తెలుగు రాష్ట్రాల మధ్య అంతరాష్ట్ర సర్వీసులు నిలిచిపోయాయి. కోవిడ్ తదనంతర పరిణామాల నేపథ్యంలో ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసులపై టీఎస్ఆర్టీసీ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఓ వైపు కోవిడ్ ఆంక్షలు ఎత్తేసి ప్రయాణికుల రాకపోకలు సాగిస్తున్న తరుణంలో నిర్ధిష్టమైన ఒప్పందం చేసుకుంటే తప్ప తెలంగాణ భూభాగం లోకి బస్సులను అనుమతించబోమంటూ అక్కడి అధికారులు ఖరాఖండిగా తేల్చేశారు.

## పలు దఫాలుగా చర్చలు

కోవిడ్ తదనంతరం సాధారణ పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో టీఎస్ అధికారులు బస్సులపై ఆంక్షలు విధించడంతో అధి కారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుమార్లు అధికారుల స్థాయిలో చర్చలు జరిపినా ఓ కొలిక్కి రాలేదు

. రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు పలుమార్లు హైదరాబాద్ వెళ్లి చర్చలు జరిపినా సమస్య కొలిక్కి రాలేదు. రోజు రోజుకూ పరిస్థితి జఠిలమవు తున్న తరుణం లో అప్పటి రవాణాశాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) వెళ్లి తెలంగాణ మంత్రి పువ్వాడ అజయ్‌తో చర్చలు జరిపారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించాలనే అభిప్రాయం వ్యక్తమైనప్పటికీ అధికారుల స్థాయిలో ఒప్పందాలు కొంత జాప్యమయ్యాయి.

ఏపీ ప్రభుత్వ చొరవ, అధికారుల కృషితో ఎట్టకేలకు తెలంగాణ అధికారులు అంతరాష్ట్ర ఒప్పందానికి అంగీకరించారు. అంతకు ముందున్న కిలో మీటర్లను పక్కన బెట్టి ఏపీ, తెలంగాణ భూభాగాల్లో రెండు రాష్ట్రాల బస్సులను లక్షా 2వేలకే పరిమితం చేశారు. ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు తెలంగాణ భూభాగంపై లక్షా రెండు వేల కిలో మీటర్ల పరిధిలో 560 వరకు బస్సులు నడుపుతోంది. ఇదే దామాషాలో ఏపీ భూభాగంపై టీఎస్ ఆర్టీసీ సంస్థకు చెందిన 830 వరకు బస్సులు నడుస్తున్నాయి. గతంతో పోల్చితే కిలో మీటర్లు, బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో ప్రైవేటు ఆపరేటర్లకు డిమాండ్ పెరిగింది. తప్పని సరి స్థితిలో పెద్ద ఎత్తున ప్రయాణికులు ప్రత్యమ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నారు.

## డిమాండ్ ఉన్నా..

రోజు రోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్య నేపథ్యంలో సర్వీసుల పెంపుపై పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. ఇదే విషయాన్ని పలుమార్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు టీఎస్ ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పలుమార్లు ఇదే అంశంపై అక్కడి అధికారులతో చర్చించారు. పరస్పర ఆమోదం తో కిలో మీటర్లు పెంచుకొని బస్సుల సంఖ్య పెంచుదామం టూ పలు మార్లు ప్రతిపాదనలు పంపారు. అయితే ఇప్పటి వరకు అక్కడి అధికారుల నుంచి సానుకూల స్పందన లేదని చెపుతున్నారు. కనీసం గతంలో ఉన్న కిలో మీటర్లనైనా పునరుద్ధరించేందుకు టీఎస్ ఆర్టీసీ అధికారులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వపరంగా చేసిన ప్రయ త్నాలు సైతం ఫలించ లేదు.

అన్ని రాష్ట్రాల నుంచి సానుకూలత వ్యక్తమైన నేపథ్యం లో మరోసారి టీఎస్ ఆర్టీసీ అధికారులతో సమస్య పరిష్కా రంపై చర్చించేందుకు ఆర్టీసీ ఉన్నతాధి కారులు నిర్ణయించారు.

# అదానీ గ్రూప్ వెనుక ఎవరున్నారో నిగ్గుతేల్చాలి : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: మోసం, షేర్లకు సంబంధించి అవకతవకలకు పాల్పడిందనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్‌పై సమగ్ర చర్చ జరగాలని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సోమవారం డిమాండ్ చేశారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రెండేండ్లుగా తాను ఈ అంశాన్ని లేవనెత్తుతున్నానని చెప్పారు. కోట్ల రూపాయల అవినీతితో పాటు దేశ మౌలిక సదుపాయాల వ్యవస్థను ఓ వ్యక్తి హైజాక్ చేశారని రాహుల్ ఆరోపించారు.

అదానీ గ్రూప్ వెనుక ఉన్న శక్తులెవరో మనం నిగ్గుతేల్చాలని, కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని..ఈ అంశంపై చర్చకు వెనుకాడుతోందని దుయ్యబట్టారు. అదానీపై ఎలాంటి చర్చలు జరగకుండా ప్రధాని మోదీ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపించాలని విపక్షాలు నిరసనలకు దిగడంతో సోమవారం లోక్‌సభ వాయిదా పడింది. సభ తొలుత ప్రారంభం కాగానే, కాంగ్రెస్ సహా విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి అదానీ సర్కార్ షేమ్..షేమ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

అదానీ గ్రూప్ షేర్ల పతనం, కార్పొరేట్ దిగ్గజం వ్యాపార పద్ధతులపై విచారణ జరిపించాలని సభ్యులు డిమాండ్ చేశారు. అదానీ గ్రూప్ అక్రమాలపై హిండెన్‌బర్గ్ రీసెర్చి నివేదికతో గ్రూపు కంపెనీల షేర్లు గత కొన్ని సెషన్స్‌లో భారీ నష్టాలను మూటగట్టుకున్న సంగతి తెలిసిందే. వరుస పతనాలతో అదానీ గ్రూపు కంపెనీలు ఏకంగా రూ. 8.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను కోల్పోయాయి.

# హరీష్ బడ్జెట్‌లో భారీ అంకెలే తప్ప బడుగులకు ఒరిగిందేమి లేదు - భట్టి




హైదరాబాద్, ఫిబ్రవరి 6: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ లో భారీ అంకెలు కనిపించాయి కానీ కొత్తేమి లేదన్నారు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క. తెలంగాణ బడ్జెట్?లో అంకెలగారడి, మాయమాటలు తప్ప ఏమిలేవని అన్నారు. ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయం వచ్చేసరికి.. హామీలతోనే కాలం వెళ్లదీస్తున్నారని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్?లో బలహీన వర్గాలకు ఒరిగిందేమీ లేదన్న భట్టి.. 8 ఏళుగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రుణమాఫీ ఎక్కడ అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సందర్భం వచ్చిన ప్రతిసారి అధికార పార్టీ నేతలు 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెబుతున్నారని, కానీ, 5 గంటలు కూడా కరెంట్ రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లిక్కర్ ఆదాయం ఒక్కటే భారీగా కనిపిస్తోందని.. నిరుద్యోగ భృతి, గిరిజన బంధు ఏమైనాయని భట్టి నిలదీశారు. నీళ్లు, నిధులు, నియామకాలు ఎక్కడ అని ప్రశ్నించారు. కృష్ణా జలాలకు సంబంధించి ప్రాజెక్టుల మాటే లేదని.. ఎవరో అధికారులు రాసిస్తే దాన్ని హరీష్ రావు చదివారని భట్టి ధ్వజమెత్తారు. విద్యార్థులను గాలికి వదిలేశారన్నారు. ఇక రుణమాఫీ నిధులు ఏమయ్యాయని ప్రభుత్వం పై భట్టి ప్రశ్నల వర్షం కురిపించారు.

## జర్నలిస్ట్ ల ప్రస్తావన బడ్జెట్ లో ఎక్కడ - జగ్గారెడ్డి

హరీష్ రావు బడ్జెట్ పుస్తకం చాలా లావుగా ఉంది కానీ అందులో మ్యాటర్ లేదన్నారు కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రజల సమస్యలు గవర్నర్ ప్రసంగంలో రాలేదని.. కనీసం ఈ బడ్జెట్ లోనైనా వస్తాయని ఆశ ఉండేది అన్నారు. కాన్సర్ రోగులు, గుండె రోగుల ప్రస్తావన బడ్జెట్ లో రాలేదన్నారు. విభజనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టుల గురించి బడ్జెట్ లో లేదన్నారు . యాదగిరి గుట్ట కు మెట్రో కావాలని డిమాండ్ చేసాము కానీ ప్రస్తావన లేదని దుయ్యబట్టారు. హరీష్ రావు ఓ పుస్తకం తెచ్చి పాఠం చదివి వెళ్లారని ఎద్దేవా చేశారు. అనాధాపిల్లలను ఆదుకుంటామన్నారు ముఖ్యమంత్రి కేసీఆర్.. కానీ బడ్జెట్లో ప్రస్తావన లేదన్నారు. తెలంగాణ ప్రజల కోసం అసెంబ్లీ లోపల, బయట పోరాటం చేస్తామన్నారు. బడ్జెట్ లో సవరణలు చేయాలన్నారు.

బిసిలకు 6వేల కోట్లు మాత్రామే బడ్జెట్ కేటాయించారని అన్నారు. 8 ఏళ్లుగా ఎస్సి, ఎస్టీ సబ్ ప్లాన్ నిదులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. రుణమాఫీ సరిగ్గా చేయకపోవడంతో 16లక్షల మంది రైతుల అకౌంట్స్ నిరర్ధకంగా మిలిగిపోయాయన్నారు. ఇక నిరుద్యోగ భృతి, గిరిజనబంధు ఊసే లేదన్నారు. లిక్కర్ ఆదాయం బడ్జెట్ లో బాగా కనిపించిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఉపయోగపడే నిదులు, నీళు, నియామకాలు, ఆత్మగౌరవం అనే నాలుగు సూత్రాలు బడ్జెట్ లో కనిపించలేదన్నారు.

# బంగారు తెలంగాణలో పోడు రైతులకు పట్టాలు పంపిణీ ఎప్పుడు?

## -మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేసీఅర్ ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు గుప్పించారు. సోమవారం అశ్వరావుపేట నియోజకవర్గం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆయన మాటాడుతూ బంగారు తెలంగాణలో పోడు రైతులకు పట్టాలు పంపిణీ ఎప్పుడు జరుగుతాయని ప్రశ్నించారు. తెలంగాణలో బతుకులు బాగు పడతాయని నాడు ఉద్యమంలో పాల్గొన్న వారి ఆకాంక్షలు ఇంతవరకు నేరవేరలేదని విమర్శించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళు కలగానే మారాయన్నారు. నిరుద్యోగ భృతి హామీ ఇంతవరకు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. పంచాయితీలకు పెండింగ్ బిల్లులే మంజూరు చేయలేదు గానీ.. ప్రతి పంచాయితీకి రూ. 10 లక్షలు మంజూరు చేస్తామన్న సీఎం కేసీఅర్ హామీ హాస్యాస్పదంగా ఉందని పొంగులేటి అన్నారు.కాగా తన రాజకీయ భవిష్యత్‌పై ఈరోజు క్లారిటీ ఇస్తానని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. అయితే పార్టీ మారే నిర్ణయంపై నాన్చివేత ధోరణి ప్రదర్శించారు. ఈ ఆత్మీయ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంటారని అన్నారు... కానీ ప్రకటన చేయలేదు. ప్రజాభిప్రాయం ప్రకారమే పార్టీ మారే నిర్ణయం తీసుకుంటామన్నారు. అశ్వరావుపేట అభ్యరిగా జారే ఆదినారాయణ ను పొంగులేటి ప్రకటించారు. తాను ఏ పార్టీలో ఉన్నా తన వర్గీయులకు టికెట్ ఇచ్చే దమ్ముంది కాబట్టే అభ్యర్థులను ప్రకటిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రులు అంటే ఎన్టీఆర్ వైఎస్ఆర్ మాదిరి ప్రజల గుండెల్లో ఉండాలంటూ పరోక్షంగా సీఎం కేసీఅర్‌పై పొంగులేటి శ్రీనివాసరెడ్డి సెటైర్లు వేశారు.

